# జంతువాది

రాచప్పకి కుక్కలంటే ఇష్టం .... పిల్లలంటే అసహ్యం, కోపం, కాని రాచ్చప్పకి పిలల్లలున్నారు. కుక్కల్లేవు. ఈమధ్యనే ఎక్కడ్నించో ఒక కుక్క పిల్లనితెచ్చాడు. ఆప్యాయంగా, ప్రేమగా పెంచుతున్నాడు. ఇరవై నాలుగ్గటంలూదాని పైనే ధ్యాస , దృష్టీనూ, దాని మెడ చుట్టూ గొలుసుబిగించి, దాన్ని చేత్తోపుచ్చుకుని వీధులన్నీ తిరుగుతుంటాడు. రోజూ రాత్రిపూటదానికి మాంసాహారవిందులు పనిగట్టుకుని మిలట్రీ హొటల్లోంచి మాంసాహారాన్ని తెచ్చి దానికి తినిపిస్తుంటాడు రాచప్ప. భార్యకి ఈ కార్యక్రమంతా సుతారమూ గిట్టదు. ఆ కుక్కపైని అంత కాలం, డబ్బు ఖర్చుపెట్టటం ఆమెకి నచ్చదు. పెళ్ళయిన ఇన్ని సంవత్సరాల్లో భర్త దానిపైన చూపిస్తున్న ప్రేమలో , ఆదరణలో, నూరోవంతు గూడా తనపైని చూపక పోవటం ఆమె కోపానికి , ఆసూయకి అసలు ఆకరణం కావచ్చు.

అంచేత ఆమె ఈ పీడని వొదిలించుకునే మార్గంకోసం, తరుణంకోసం ఓపిగ్గా ఎదురు చూడసాగింది.

ఈ జంతువాదం, వాటిపైన ప్రేమ రాచప్ప తండ్రిక్కూడా వుండేది. ఆయన కూడా ఇలాగే ఒక కుక్కని తెచ్చి ' లూసీ ' అని పేరు పెట్టి, కొంతకాలం పెంచేడు. కాకపోతే ఆయన దానికి శుశ్రూష సొంతపిల్లలికి చేసినట్లే చేసేవాడు. రోజూ దానికి సబ్బు పట్టించి స్నానం చేయించటం, పప్పుకూరలు , పచ్చళ్ళు కలిపి తిండిని బలవంతానో నోట్లో కుక్కటం, అది రాత్రిపూట ' కుయ్యో కుయ్యో ' మంటే వుదయ్యాన్నే దాని నోట్ల గరాటు పెట్టి ఆముదం పొయ్యటం....ఇవన్నీ భరించలేక అది కొద్ది రోజులకే కాలం చేసింది.

రాచప్ప తండ్రి తప్పుల్ని సరిదిద్దే వుద్దేశ్యంతో , ఆయన కుక్కని పెంచిన పద్దతులకి, పూర్తి వ్యతిరేకంగా పెంచసాగేడు. తండ్రి కుక్క పేరు ( అంటే తండ్రి పెంచిన కుక్కని భావం ) ' లూసీ ' అయితే తన కుక్క పేరు ' సీలూ ' గా మొదలై ఆహార అలవాట్లతో సహా అనేక మార్పులు అమలు పరిచాడు.

రాచప్ప భార్యకి సహనం నశించింది. ' సీలూ ' ఆగడాలు భరించటం ఎంతమాత్రం తనవల్ల కాదనిపించింది. ప్రతిరోజూ పరుపులు, పక్క బట్టలు వుతికి ఆరేసుకోవటం , ఇల్లంతా తిరగటం కోసారి నీళ్ళు చల్లి తుడుచుకుకోవటం తన వల్ల కాదనిపించి, ఆరోజు

ఎలాగైనా దాన్ని వొదిలించుకోవాలని రాచప్ప ఇంట్లో లేనప్పుడు దాన్ని గొలుసు పట్టి వీధిలోకి తెచ్చింది.

ఎదురుగా స్కూలు కెడుతున్న చిట్టి, పొట్టి కనిపించేరు. ఆవిడ ప్రాణం లేచొచ్చింది " ఒరేయ్ చిట్టి మా తండ్రివి కదూ – ఈ ముండని కాస్త పట్టుకెళ్ళి వూరిబయట వదిలేసిరా నీకు పుణ్యం వుంటుంది. నీకోపావలా ఇస్తా పకోడీలు కొనుక్కు తిను " అంది బాధగా.

పొట్టివంక చూసేడు చిట్టి ఏం చేద్దామన్నట్టు పొట్టి కళ్ళతోనే వుత్సాహం ప్రకటించేడు. ఇద్దరూ 'సీలూ ' వంక చూసేరు . అది ఎగిరెగిరి పడుతూ కుయ్ కుయ్ అంటూ ఆవిడ చీర కుచ్చిళ్ళని పట్టి పీకుతాంది.

పొట్టి ముందుకెళ్ళి ఆవిడచేతిలోని గొలుసు నందుకున్నాడు. ఆవిడ కొంగుముడి విప్పి పావలావాళ్ళకిస్తూ " మళ్లీ ఈ బజారుకి రాకుండా చెయ్యండి అన్నట్లు, ఈ విషయం ఎవ్వరికీ చెప్పకండి " అంది.

వాళ్ళిద్దరూ తలలూపి ఆవిడిచ్చిన పావలాని కుక్కని పట్టుకుని స్కూలు కెడుతూ ఏం చెయ్యాలని తీవ్రంగా చర్చించారు. ఏకాభిప్రాయం కుదరక, అప్పటికే స్కూలుకిటైం అవటం చేత ప్రస్తుతానికిదాన్ని , స్కూలు వెనకాలున్న నంది వర్దనం చెట్టు కు కట్టేసివుంచాలని , సాయంత్రం తిరిగి చర్చలు కొనసాగించాలని ఏక గ్రీవంగా నిర్ణయించేరు. అనుకున్నట్లే చేసారు కూడా.

సాయంత్రం స్కూలయిపోయేక , ఆవిడ కోరినట్లు వూరి బయటికి తీసుకెళ్ళి దాన్ని వదిలెయ్యాలని వాళ్ళ పథకం. కాని మధ్యాహ్నం స్కూలునించి ఇంటికొస్తుంటే , రాచప్ప ఇంటి దగ్గిరకొచ్చేసరికి లోపల్నించి పెద్దగా , కోపంగా కేకలు వినిపించాయ్ " చెప్పు దాన్నెక్కడ వదిలేసావ్ ప్రాణాలు తీస్తా పాడుముండా " అని రాచప్ప గొంతు, ఆ పైన దభీదభీమని శబ్బాదలు , వెంటనే ' నాకేం తెలీదండి – అబ్బ కొట్టకండి ' అని ఆయన భార్య ఏడుపులు, ప్రార్ధింపులు……

చిట్టిపొట్టికి విషయం అర్ధమైంది రాచప్ప కుక్కకోసం కట్టుకున్న దాన్నికొట్టి చంపుతున్నాడు జంతుప్రేమ మానవతావాదాన్ని అధిగమించింది. వాళ్ళిద్దరూ కళ్లతోటే మాట్లాడుకున్నారు. ఏదో నిర్ణయానికొచ్చి . పొట్టి రివ్వున పరితెత్తుకెళ్ళి క్షణాలపైన ' సీలూని ' పట్టుకొచ్చేడు. రాచప్ప ఇంటి తలుపు తట్టేరు. . లోపల శబ్దాలు ఆగిపోయినాయ్. తలుపు తీసుకుని రాచప్ప బయటికొచ్చేడు. సీలూని చూసి ఒక్క గంతులో దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. పొట్టి అన్నాడు. " మేమే ముద్దొచ్చి పట్టుకెళ్ళాం.

అందరూ  దీన్ని పొగట్టమే ”

రాచప్ప  ఇంకేం వినిపించుకోకుండా  దాన్ని చేతుల్లో పుచ్చుకుని లోనికెళ్లాడు.

ఆయన భార్య ఎర్రకళ్ళతో, దీనంగా ప్రక్కనే నిల్చునుంది. వాళ్ళిద్దరూ తలలొంచకున్నారు. చిట్టి జేబులోంచి ఆవిడిచ్చిన పావలా కాసుని బయటికి తీసి గుమ్మంవైపు వుంచేడు.

ఇద్దరూ కదిలి ఇళ్ళదారి పట్టేరు.

**------- అయ్యిపోయింది -------**